క్లుప్తంగా

కర్ణాటక మంత్రికి సన్మానం

దేవరకద్ర: కర్ణాటక రాష్ట్ర సైన్స్ అండ్ టెక్నాలజీ, నీటి పారుదల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన బోసురాజును గురువారం బెంగుళూర్‌లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, దేవరకద్ర కాంగ్రెస్ నేత ప్రదీప్‌కుమార్‌గౌడ్ కలిసి అభినందనలు తెలిపి ఘనంగా సన్మానించారు. ఎన్నికల సందర్భంగా ప్రచారంలో ముఖ్య భూమిక వహించిన ప్రదీప్‌కుమార్‌గౌడ్‌ను మంత్రి ఈ సందర్భంగా ప్రశంసించారు. తెలంగాణలో కూడా కాంగ్రెస్ విజయభేరి మోగిస్తుందని ప్రదీప్‌కుమార్‌గౌడ్ అన్నారు.

విద్యార్థినికి

మిడ్జిల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని సింధును ఎంపీసీలో 949 మార్కులు సాధించిన సందర్భంగా గురువారం ఘనంగా సన్మానించారు. ప్రిన్సిపాల్ వెంకటయ్య, అధ్యాపకులు చరణ్, అక్తర్, నాగమణి, అనిత, తదితరులు పాల్గొన్నారు.

ఐఐటీ జామ్ పరీక్షలో పీయూ విద్యార్థి ప్రతిభ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థి విస్లావత్ ప్రేమ్ జాతీయ స్థాయిలో నిర్వహించే ఐఐటీ జామ్ పరీక్షలో సత్తా చాటి ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీకి ఎంపిక అయ్యారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థిని కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్ అధ్యాపకులు అభినందించారు. హెచ్‌ఓడీ చంద్రకిరణ్, అధ్యాపకులు శ్రీధర్, రామ్మోహన్, ఆమేషా ఆస్మీ, రవికుమార్, సిద్ధరామయ్య ఉన్నారు.

నేడు కాంగ్రెస్ ఆధ్వర్యంలో వేడుకలు

మహమ్మదాబాద్: రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సోనియా గాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేయనున్నట్లు పార్టీ అధ్యక్షుడు కేఎం నారాయణ తెలిపారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో కార్యక్రమం విజయవంతం చేయాలని సూచించారు.

వాహనదారులకు ఇబ్బంది కలిగించొద్దు

జడ్చర్ల టౌన్: జాతీయరహదారిపై వాహనాల రాకపోకలు అధికంగా ఉన్నందున ఇబ్బందులు కలిగించేలా సామగ్రి రోడ్డుపై ఉంచరాదని వ్యాపారులకు 12వ వార్డు కౌన్సిలర్ రఘురాంగౌడ్ గురువారం సూచించారు. 167వ నెంబరు జాతీయరహదారిపై 12 వార్డు పరిధిలో ఖైరా కాంప్లెక్స్ వద్ద రోడ్డుపై సామగ్రి ఉంచటాన్ని, నిర్మాణ సామగ్రిని పారవేయటాన్ని వార్డు అధికారి శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని ఫిర్యాదులు అందాయని వెంటనే సామగ్రి తొలగించాలని కోరారు.

క్రీస్తు మార్గంలో నడవాలి



స్టేషన్ మహబూబ్‌నగర్: క్రీస్తు మార్గంలో నడిస్తే జీవితాలు మారుతాయని జంగారెడ్డిగూడెంకు చెందిన పాస్టర్ ఏఆర్.పాల్‌సన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఏఆర్ గార్డెన్స్ ఫంక్షన్‌హాల్‌లో గురువారం నుంచి జీసస్ పవర్ అపోస్టలిక్ మినిస్ట్రీస్ దాసరి సోదరుల ఆధ్వర్యంలో చిల్డ్రన్స్ రీట్రీట్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పాస్టర్ క్రీస్తూ సందేశం ఇచ్చారు. చిన్నారులు దైవమార్గాన్ని అనుసరిస్తే సమాజంలో మంచి పౌరులుగా, సమాజానికి మంచి చేసేవారిగా నిలబడుతారని అన్నారు. అనంతరం గుంటూర్‌కు చెందిన పాస్టర్ సాదు సుందర్‌సింగ్, రాజమండ్రికి చెందిన జాన్సన్ సందేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా బైబిల్ కథలు, దేవుని పాటలు, మ్యాజిక్‌షో, చిన్నారులకు బైబిల్ క్విజ్, కంఠతా వ్యాఖ్యలు, పప్పెట్ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. రాబర్ట్‌వెస్లీ బృందం ఆధ్వర్యంలో భక్తిగీతాలు ఆలపించారు. శుక్రవారం నుంచి రెండు రోజులపాటు ఆశీర్వాద కూడిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేట్ పాస్టర్లు డానియల్ సుధీర్, పరియన్, నిర్వాహకులు దాసరి సుందర్, దాసరి ప్రసాద్, దాసరి సామ్యేల్, కిరణ్, ప్రభాకర్, బెంజిమెన్, మెల్కిసెదెక్, గుర్రం అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం

అడ్డాకుల: సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరమని మూసాపేట ఎస్‌ఐ విజయభాస్కర్ అన్నారు. అచ్చాయపల్లిలో గురువారం రాత్రి మహబూబ్‌నగర్ జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన సురక్ష పోలీసు కళాబృందం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సైబర్ నేరాలు జరిగే విధానం గురించి ప్రజలను చైతన్యం చేశారు. మొబైల్ ఫోన్లకు వచ్చే లింకులకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఓపెన్ చేయవద్దని సూచించారు. అదేవిధంగా ఓటీపీలను ఎవరితోనూ షేర్ చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సంబురాలకు సర్వం సిద్ధం



నవాబుపేటలో మాట్లాడుతున్న తహసీల్దార్ రాజేందర్‌రెడ్డి



జడ్చర్లలో సమీక్ష నిర్వహిస్తున్న జెడ్పీసీఈఓ జ్యోతి



విద్యుత్ దీపాలతో ముస్తాబైన మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్ కార్యాలయం



విద్యుత్ దీపాలంకరణలో కోటకదిర గ్రామపంచాయతీ

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): రాష్ట్ర అవతరణ దినోత్సవాల్లో భాగంగా శుక్రవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ సీఈఓ జ్యోతి తెలిపారు. దశాబ్ది ఉత్సవాల కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. చైర్ పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి జాతీయపతాకాన్ని ఆవిష్కరించనున్నట్లు పేర్కొన్నారు.

మహబూబ్‌నగర్ రూరల్: రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని మండల పరిధిలోని గ్రామపంచాయతీ కార్యాలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయం, మహబూబ్‌నగర్ అర్బన్, రూరల్ తహసీల్దార్ కార్యాలయాలలో శుక్రవారం ఉదయం అధికారులు జాతీయ జెండాలను ఎగుర వేయనున్నారు. కోటకదిర గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ మల్లు రమ్య దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నూతన మైక్‌సెట్, ఎల్‌ఈడీ విద్యుత్ దీపాలతో సుందరంగా ముస్తాబు చేశారు.

జడ్చర్ల టౌన్: రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను జయప్రదం చేద్దామని జెడ్పీ సీఈఓ జ్యోతి పేర్కొన్నారు. ఎంపీడీఓ చాంబర్‌లో గురువారం సాయంత్రం సర్పంచ్‌లు, అధికారులతో దశాబ్ది ఉత్సవాలపై ఆమె సమీక్ష నిర్వహించారు. పతాకావిష్కరణ, అమరవీరులకు నివాళి అర్పించాలన్నారు. తరువాత జూన్ 22 వరకు నిర్వహించే కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. 5న విద్యుత్తు విజయోత్సవాలు, 7న తెలంగాణ ఇరిగేషన్ దినోత్సవం, 9న వెల్ఫేర్ ప్రోగ్రాం, 13న ఉమెన్స్ వెల్ఫేర్ దినోత్సవం, 14న వైద్య ఆరోగ్య దినోత్సవం వేడుకలు పెద్ద ఎత్తున ఉంటాయన్నారు. తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఏడీ ఫిషరీస్ రాధారోహిణి, ఎంపీడీఓ ఉమాదేవి, సర్పంచ్‌లు, ఇతర మండల అధికారులు పాల్గొన్నారు.

నవాబుపేట: రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించేలా అన్ని రకాలుగా కార్యక్రమాలు నిర్వహించాలని తహసీల్దార్ రాజేందర్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో గురువారం అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 21 రోజులు పాటు ముఖ్యంగా రైతు దినోత్సవాలు, మిషన్ కాకతీయ, భగీరథ, మహిళా, పారిశుద్ధ్యం తదితర అంశాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. అలాగే రైతు దినోత్సవం సందర్భంగా అన్నదాతలతో సహపంక్తి భోజనం, ర్యాలీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జెడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు, మార్కెట్ చైర్మన్ లక్ష్మయ్య, ఎంపీపీ అనంతయ్య, ముడా డైరెక్టర్ చెన్నయ్య, ఎంపీడీఓ శ్రీలత, వ్యవసాయ అధికారి కృష్ణకిషోర్, శ్వేత, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాలకు మండలంలోని గ్రామ పంచాయతీ కార్యాలయాలు ముస్తాబయ్యాయి. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం, జంగమయ్యపల్లిలోని పంచాయతీ కార్యాలయాలను విద్యుత్ దీపాలు, మామిడి తోరణాలతో అలంకరించి ముస్తాబు చేశారు. వీటితో పాటు మండల కేంద్రంలోని రైతు వేదికను సిద్ధం చేశారు.

దేవరకద్ర: రాష్ట్ర అవతరణ దినోత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం ప్రభుత్వ కార్యాలయాలన్ని ముస్తాబు చేశారు. జాతీయ పతాకాలను ఆవిష్కరించడానికి ఏర్పాట్లను పూర్తి చేశారు. నియోజకవర్గ కేంద్రంలో సంబరాలకు ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి హాజరు కానున్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉదయం 8.15 గంటలకు, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఉదయం 8.50 గంటలకు జాతీయ పతాకావిష్కరణ చేయనున్నారు.

క్రీడలతో యువతకు మేలు



దుస్తులు అందజేస్తున్న మనోహర్‌రెడ్డి

మహమ్మదాబాద్: క్రీడలతో యువతకు ఎంతో మేలు కలుగుతుందని, శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంటారని డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి తెలిపారు. మహమ్మదాబాద్ బాలుర ఉన్నత పాఠశాలలో సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్న క్రీడాకారులకు, కోచ్‌లకు బీఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం దుస్తులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నప్పటి నుంచే యువత చదువుతో పాటు క్రీడల్లో మంచి ప్రావీణ్యం పొందితే ఎన్నో ఉద్యోగాల్లో చేరవచ్చని సూచించారు. ఇక్కడ చదువుకున్న నాటి యువకులు క్రీడల్లో నైపుణ్యం పొందిన వారు నేషన్‌లెవల్ క్రీడాకారులుగా, ఫిజికల్ డైరెక్టర్లుగా, పోలీసు శాఖలో, ఆర్మీ, నేవీ మరెన్నో శాఖల్లో ఉద్యోగాలు చేస్తూ వారి కుటుంబాలను అభివృద్ధి చేసుకుని సమాజంలో ఎంతో పేరు ప్రతిష్టలు తీసుకువచ్చారని సూచించారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు గిరిధర్‌రెడ్డి, గోపాల్, కేశవులు, ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు తొలగించిన వారిపై చర్యలు తీసుకోండి



రోడ్డు తొలగింపు అడ్డుకున్న రైతులు

కోయిల్‌కొండ: మండలంలోని మల్కాపూర్‌రోడ్డు నుంచి వర్దన్నపల్లితండా వరకు వేసినరోడ్డును కొందరు తండా వాసులు తమ స్వార్థం కోసం జేసీబీతో తొలగించారని గురువారం రైతులు తహసీల్దార్ కార్యాలయం ఎదట ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీ నక్షలో ఉన్న రోడ్డును తొలగించడం అన్యాయమని తమకు న్యాయం చేయాలని వారు తహసీల్దార్ ప్రేమ్‌రాజ్‌ను కోరారు. మూడు సంవత్సరాల క్రితమే సర్వే చేయించి రోడ్డును వేసుకున్నట్లు వివరించారు. అంతకుముందు తహసీల్దార్ ప్రేమ్‌రాజ్, ఎస్‌ఐ సతీష్ రోడ్డు తొలగింపును పరిశీలించారు. రోడ్డు తొలగింపును ఆపాలని తండా కోరగా ఇరువర్గాల రైతులు కూర్చొని మాట్లాడుకొని సమస్యను పరిష్కరించుకోవాలని చెప్పి వెళ్లిపోయారు. అయినా వినకుండా కొందరు మళ్లీ రోడ్డును తొలగిస్తుంటే రైతులు తహసీల్దార్‌తో మొర పెట్టుకున్నారు. దీంతో ఆయన సర్పంచ్ నారాయణతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను వెంటనే పరిష్కరించుకోవాలని కోరారు. నర్సింహారెడ్డి, కృష్ణారెడ్డి, మాధవరెడ్డి, రవీందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, భీమన్న, నారాయణ, నాగన్న, గోవర్ధన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సబ్‌సెంటర్‌లో తనిఖీ



సెంటర్‌ను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాఆరోగ్య శాఖ అధికారి కృష్ణ

నవాబుపేట: మండల పరిధిలోని రుద్రారం పీహెచ్‌సీని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి కృష్ణ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సబ్ సెంటర్ అయుష్మాన్ భారత్ వెల్‌నెస్ సెంటర్‌గా ఎంపిక కావడంతో అక్కడ కేంద్రం ఏర్పాటుకు జరుగుతున్న పనులను పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని సూచించారు. త్వరలో కేంద్ర వైద్యశాఖ బృందం పరిశీలనకు రానున్న నేపథ్యంలో జిల్లా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

రెజ్లర్లకు మద్దతుగా ఉద్యమం ఉధృతం

స్టేషన్ మహబూబ్‌నగర్: మహిళా రెజ్లర్లకు మద్దతుగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ హక్ అన్నారు. ఢిల్లీలో ఆందోళన చేస్తున్న మహిళా రెజ్లర్లకు మద్దతుగా యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలో నరేంద్రమోదీ, అమిత్‌షాల దిష్టిబొమ్మలు దహనం చేశారు. అబ్దుల్ హక్ మాట్లాడుతూ మహిళా రెజ్లర్లను లైంగికంగా, మానసికంగా వేధిస్తున్న బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌సింగ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతర్జాతీయ స్థాయిలో పతకాలు తీసుకొచ్చిన మహిళా రెజ్లర్లు రోడ్డుపైకి రావడం బాధాకరమని అన్నారు. ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు ఎం.సాయిబాబా, పట్టణ మైనార్టీ విభాగం అధ్యక్షుడు అజ్మత్‌అలీ, పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ సల్మాన్, అసెంబ్లీ కార్యదర్శి శివశంకర్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

కళాకారులను ఆదరించండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న శివకుమార్

జడ్చర్ల టౌన్: నాటకాలను, కళాకారులను ఆదరించాలని రాష్ట్ర సంగీత నాటక అకాడమీ మాజీ చైర్మన్ బి. శివకుమార్ గురువారం పిలుపునిచ్చారు. ఈనెల 3న మున్సిపాలిటీ పరిధిలోని పాతబజార్ హనుమాన్ ఆలయ హాల్‌లో జనతాసేవాసమితి ఆధ్వర్యంలో ప్రదర్శించనున్న కృష్ణాంజనేయ యుద్ధం పౌరాణిక నాటకానికి సంబంధించిన ప్రచార పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పౌరాణిక నాటకాల పట్ల ఇటీవల ప్రజల్లో ఆసక్తి పెరుగుతోందని, అందుకే ప్రదర్శనలు పెరుగుతున్నాయన్నారు. నియోజకవర్గంలో నాటక కళాకారులు ఎంతోమంది ఉన్నారని, ఆదరిస్తే ఉత్సాహంగా ప్రదర్శనలు ఇవ్వగలుగుతారన్నారు. కృష్ణాంజనేయ యుద్ధం నాటకానికి వరకవుల నరహరిరాజు సంగీతం, దర్శకత్వ బాధ్యతలు పోషిస్తున్నారన్నారు. పోస్టర్ ఆవిష్కరణలో నాటక కళాకారుడు అయ్యన్న, వార్డుకౌన్సిలర్ దేవా, యువనాయకుడు రంజిత్‌బాబు, బాలు, పర్మటయ్య పాల్గొన్నారు.

రెజ్లర్లపై పోలీసు చర్య సరికాదు

మహబూబ్‌నగర్ క్రీడలు: రెజ్లింగ్ ఫెడరేషన్ మాజీ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ మహిళా రెజ్లర్లను మానసికంగా, లైంగికంగా వేధిస్తున్నాడని అతడిపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నిరంజన్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఢిల్లీలో ఆందోళన చేస్తున్న మహిళా రెజ్లర్లను పోలీసులు అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు వివరించారు. క్రీడాకారులుగా దేశానికి అంతర్జాతీయస్థాయిలో పతకాలు సాధించిన మహిళా రెజ్లర్లు తమకు న్యాయం చేయాలని శాంతియుతంగా ఆందోళన చేస్తుంటే అనుమానంగా వ్యవహరించడం సరికాదన్నారు.

పోల్కంపల్లి రోడ్డు పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ శ్రీకాంత్‌రెడ్డి

అడ్డాకుల: మూసాపేట మండలంలోని జాతీయ రహదారి నుంచి పోల్కంపల్లి వరకు బీటీరోడ్డు రెన్యూవల్ పనులు గురువారం ప్రారంభమయ్యాయి. ఎన్‌హెచ్ 44 నుంచి పోల్కంపల్లి వరకు 1.4కిలోమీటర్ల దూరం బీటీరోడ్డు పూర్తి గుంతలమయంగా మారడంతో బీటీ రెన్యూవల్ పనులకు ఎంఆర్‌ఆర్ ద్వారా రూ.90లక్షలు మంజూరయ్యాయి. టెండర్ ప్రక్రియ పూర్తి కావడంతో స్థానిక సర్పంచ్ శ్రీకాంత్‌రెడ్డి, పంచాయతీ రాజ్ ఏఈ లక్ష్మణ్‌గౌడ్‌లు పనులను ప్రారంభించారు. వర్షాకాలం మొదలయ్యే నాటికి పనులను నాణ్యవంతంగా పూర్తి చేసే విధంగా చూడాలని ఏఈ లక్ష్మణ్‌గౌడ్ కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మధు, మాజీ సర్పంచ్ నర్సిములు తదితరులు ఉన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం

జడ్చర్ల: అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తున్న సమయంలో ఓ మహిళ ప్రసవించి పండంటి బిడ్డకు జన్మనిచ్చిన ఘటన గురువారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి..మక్తపల్లి తండాకు చెందిన ముడావత్ రాజేశ్వరి(20) నిండు గర్భిణీ. ఈ క్రమంలో ఆమెకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌ను ఆశ్రయించారు. జడ్చర్లలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో నొప్పులు తీవ్రం కావడంతో సిబ్బంది సహకరించడంతో అంబులెన్స్‌లోనే డెలివరీ చేశారు. తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నారని సహకరించిన సిబ్బందికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

దివ్యాంగులకు 'డబుల్' ఇళ్లు ఇవ్వాలి



మాట్లాడుతున్న నల్లవెల్లి కురుమూర్తి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: దివ్యాంగులకు 'డబుల్' ఇళ్లు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి డిమాండ్ చేశారు. ఎన్‌పీఆర్‌డీ జాతీయ దివ్యాంగుల ఐక్య వేదిక ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా అధ్యక్షుడు మధుబాబు అధ్యక్షతన బుధవారం సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో 5 శాతం కోటాను దివ్యాంగులకు కేటాయించాలన్నారు. పెన్షన్లు రూ.6 వేలకు పెంచాలన్నారు. బస్సు, ట్రైన్ పాసులు అందరికీ ఇవ్వాలని, విద్య, ఉద్యోగ అవకాశాల్లో రిజర్వేషన్‌లు అమలు చేయాలన్నారు. దివ్యాంగుల ఆత్మగౌరవం, సమానత్వం వివక్షకు వ్యతిరేకంగా రక్షణ చట్టాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ నెల 16, 17 తేదీల్లో శిక్షణ తరగతులు నిర్వహించబోతున్నామని, ఉమ్మడి జిల్లాలోని దివ్యాంగులు పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో మొగులయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగం అనర్థాలపై ర్యాలీ

జడ్చర్ల టౌన్: ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి కలిగే అనర్థాలపై అవగాహన కల్పించేలా స్థానిక బీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు గురువారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈనెల 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్లాస్టిక్ వల్ల కలిగే కష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ర్యాలీని కళాశాల ప్రిన్సిపాల్ డా.అప్పియా చిన్నమ్మ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ యాదయ్య, అధ్యాపక బృందం పాల్గొన్నారు.